ప్రజాశక్తి

సోమవారం 8 జనవరి 2024

8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

'పది' ఫలితాలు మెరుగయ్యేనా?



- గతేడాది 74.67 శాతం ఉత్తీర్ణతతో 11వ స్థానం
- నూరు శాతం సాధనకు అధికారుల కసరత్తు
- ప్రత్యేక తరగతుల నిర్వహణ
- విద్యార్థులకు స్నాక్స్ పంపిణీకి మీనమేషాలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. మరో వంద రోజులు మాత్రమే గడువు ఉంది. గత కొన్నేళ్లుగా పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో కృష్ణాజిల్లా వెనుకబడుతోంది. ఈ ఏడాది విద్యాశాఖ తీసుకున్న చర్యలతో ఉత్తీర్ణత ఎంత వరకు మెరుగవుతుందనేది చర్చనీయాంశమైంది.

2023-24 విద్యా సంవత్సరంలో కృష్ణాజిల్లాలోని 27,111 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. 221 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 11,512 మంది, 174 ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులు 10,600 మంది విద్యార్థులతో పాటు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు మరో 5,011 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రాయడానికి 151 సెంటర్లను విద్యాశాఖ గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. (మిగతా 6లో)



విజయవాడలో అంగన్‌వాడీల సమ్మెను ప్రారంభించి మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.సుధాకర్



విజయవాడలో మున్సిపల్ కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారమూ కొనసాగింది. విజయవాడ ధర్నా చౌక్‌లో పలువురు రాష్ట్ర నాయకులు వారికి మద్దతు పలికారు.

... వార్తలు మెయిన్, టబ్లాయిడ్‌లో

భవానీ దీక్షల విరమణ పూర్తి



పూర్ణాహుతిలో పాల్గొన్న దుర్గగుడి ఇఒ, చైర్మన్

ప్రజాశక్తి-వన్‌టౌన్

ఈ నెల 3వ తేదీ నుండి ప్రారంభమైన భవానీ దీక్షల విరమణలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. దుర్గగుడిలోని యాగశాలలో ఆలయ వైదిక సిబ్బంది వారి ఆధ్వర్యంలో పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావుచే పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ రామారావు మాట్లాడుతూ గత ఐదు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి సుమారు రెండు లక్షల మంది భవానీలు దుర్గమ్మ ఆలయానికి చేరుకుని మాల విరమణ చేసినట్లు గావించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ,, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పశ్చిమ ఏసిపి డా. కె.హనుమంతరావు ఆధ్వర్యంలో భవానీ దీక్షల విరమణను విజయవంతం చేసినట్లుచెప్పారు. రాంబాబు మాట్లాడుతూ భవానీలకు సుమారు 15 లక్షల లడ్డూ ప్రసాదాలు అందించినట్లు చెప్పారు. దేవాలయం ఆధ్వర్యంలో భవానీలు, వారితో పాటు వచ్చే కుటుంబ సభ్యులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు.

పుస్తకంతో జీవన వికాసం

పుస్తక మహోత్సవం ముగింపు సభలో వక్తలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్




వార్త 8లో

వైసిపి పాలనలో అందరూ బాధితులే...

- రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా కదలాలి
- తిరువూరు 'రా... కదలి రా' సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-తిరువూరు

వైసిపి పాలనలో రాష్ట్రంలో తనతో సహా అందరూ బాధితులేనని, అన్ని విధాలా నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా కదలి రావాలని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. తిరువూరు బైపాస్ రోడ్డు అయ్యప్ప దేవాలయం పక్కన గల ఖాళీ స్థలంలో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం అధ్యక్షతన 'రా కదలి రా' బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వైసిపి పాలనపై విరుచుకుపడ్డారు. జగన్ పాలనలో ఎపి 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. నాలుగన్నరేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ కోలుకోలేని విధంగా దెబ్బతీశారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరు కాబడిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే తిరువూరు, నందిగామ, మైలవరం, గన్నవరం, జగ్గయ్యపేట, నూజివీడు, నియోజకవర్గాల్లోని వ్యవసాయ భూములన్నీ సస్యశ్యామలం అవుతాయని భావించి తమ ప్రభుత్వంలో రూ.4,900 కోట్లతో పనులు ప్రారంభిస్తే జగన్ ప్రభుత్వం ఆ నిధులను స్వాహా చేసిందన్నారు. రెండు వేల (మిగతా 6లో)



సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, హాజరైన జనం



విజయవాడ సమగ్రాభివృద్ధికి చర్యలు

- వందల కోట్లతో వివిధ దశల్లో పనులు
- విఎంసి చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు



ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు విఎంసి చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు తెలిపారు. 14, 15 ఆర్థిక సంఘాల నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, జనరల్ ఫండ్ తదితర నిధులతో వందల కోట్ల అంచనా వ్యయంతో వివిధ దశల్లో అభివృద్ధి సాగుతున్నట్లు చెప్పారు. విజయవాడలో చేపట్టిన వివిధ అభివృద్ధి పథకాల గురించి ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.



ప్రశ్న: అభివృద్ధి పనుల గురించి వివరించగలరు?

ప్రధానంగా రహదారుల దగ్గర నుంచి మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, పైప్‌లైన్లు, మరుగుదొడ్లు, పార్కులు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, కాంపౌండ్ వాల్స్, ఆఫీసు బిల్డింగ్, స్టేడియం, ఎయిర్‌పోర్టు కారిడార్, బందర్ రోడ్డు పుట్‌పాత్ అధునీకరణ పనులు, డంపింగ్ యార్డులోని (మిగతా 6లో)


చాగంటి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ

దుర్గమ్మను దర్శించుకున్న చాగంటి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవ స్థానం ఇంద్ర కీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మ వారిని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతుల వారు ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి, స్వామి వార్ల దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె ఎస్ రామరావు అనంతరం వీరికి ఆలయ ప్రధానార్చకులు మరియు వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, కార్యనిర్వహణాధికారి వారు శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

నూతన పింఛన్లు పంపిణీ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొండపల్లి పట్టణ సచివాలయం 5 పరిధిలోని గ్రామిక నగర్ (కొత్తగేటు) ఏరియాలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్దిదారులకు ఆదివారం కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్ధి గుంజ శ్రీనివాసు అందజేశారు.

తిరుపతమ్మను దర్శించుకున్న కొలుసు


తిరుపతమ్మ ఆలయంలో పార్ధ సారధి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ఆదివారం పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్ధసారథి దర్శించు కున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ జంగాల శ్రీనివాస్, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ముదిరాజ్ నూతన సంవత్సర కేలండర్‌ను రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను, యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారి సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. మత్స్యకార భరోసా ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు అందజేశామన్నారు. జగ్గయ్యపేటలో ముదిరాజుల భవన్ ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందించానని గుర్తుచేశారు. పోచంపల్లి గ్రామాలలో ముదిరాజ్ భవన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఆలయంలో గరుడోత్సవం

జగ్గయ్యపేట: పట్టణంలోని ప్రాచీన దేవాలయమైన రంగనాయక స్వామివారి ఆలయంలో ఆదివారం గరుడోత్సవం వైభవంగా నిర్వహించారు. పాలేటి తీరంలో కొలువై ఉన్న శ్రీ భూ గోదా సమేత రంగనాయక స్వామివారి ఆలయంలో స్వామి, అమ్మ వాళ్లకు అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథంపై గరుత్మంతుని వాహనం నుంచి స్వామి అమ్మ, వాళ్ళ ఉత్సవ మూర్తులను ఉంచి రథంపై చిన్న పీఠంపై ఆండాళ్ అమ్మవారి ఉత్సవ మూర్తిని ఉంచి గరుడ వాహన సేవను సాంప్రదాయంగా నిర్వహించారు.

25 ఆదివారాలుగా ఉచిత భోజనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని చిన్నా క్యాంటీన్ (ఉచిత నాన్ వెజ్ భోజనం) 20వ ఆదివారానికి చేరింది. ఈ సందర్భంగా పట్టణ మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇంటూరి రాజగోపాల్ ఆధ్వర్యంలో ఉచిత నాన్ వెజ్ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు.

యువకవి హనుమంతరావుకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పవిత్ర గోదావరి నది తీరాన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శ్రీ శ్రీ రాజరాజ నరేంద్రుని సహస్రాబ్ది నిరాజనంగా, నన్నయ్య భారతాంధ్రీకరణం రచించి వెయ్యేండ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ సారధ్యంలో జనవరి 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగిన రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలకి మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన యువ కవి లింగనబోయిన హనుమంతరావు రెండో రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రి వైభవం అనే కవితా శీర్షిక పేరుతో తాను రచించి వినిపించిన కవితా పఠనానికి గాను ఆత్మీయ అతిధుల మధ్య ప్రశంసా పత్రం,


హనుమంతరావుకు ప్రశంసాపత్రం, మెడల్ అందజేస్తున్న దృశ్యం

మెడల్ అందుకున్నారు. అనంతరం నన్నయ్య విశ్వవిద్యాలయం(రాజమండ్రి)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సాంస్కృతిక ఛైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అభినందించారు.



ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

జగ్గయ్యపేట: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నూతనంగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లా ఆర్య వైశ్య సంఘ నూతన అధ్యక్షుని ఎన్నిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి కళ్యాణమండపంలో రాష్ట్ర ఎన్నికల అధికారిగా ఒంగోలు పట్టణానికి చెందిన రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు విచ్చేచారు. ఉమ్మడి కృష్ణ మాజీ అధ్యక్షులు తుమ్మేపల్లి నరేంద్ర, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు ఎలక్షన్ ప్రయ్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వత్సవాయి మండలం బొగ్గవరపు వెంకట రాజారావు ఒకే నామినేషన్ వచ్చినందున అధ్యక్షునిగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు ముత్యప్రసాద్, చెన్నకేశవరావు, కృష్ణా జిల్లా నూతన అధ్యక్షులు సన్నిధి నాగ సాయి, వివిధ మండల అధ్యక్షులు, స్థానికి ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం స్థానిక మాజీ శాసన సభ్యులు శ్రీరాం తాతయ్య నివాసంలో కృష్ణ జిల్లా ఉయ్యూరు తేజ డిజిటల్ వారి వాసవి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి క్యాలెండర్ ను విచ్చేసిన అతిధులు సమక్షంలో తాతయ్య ఆవిష్కరించారు.

బిఎస్‌పి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ప్రభుదాస్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: బహుజన సమాజ్ వాది పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గం ఎంఎల్‌ఏ అభ్యర్థి, రాష్ట్ర కార్యదర్శిగా కొదమల ప్రభుదాస్‌ని రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి నియమించారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని ఈ నెల 6న, విజయవాడలో జరిగిన పార్టీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజుతో కలిసి కొదమల ప్రభుదాసుకి అందచేశారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధికార ప్రతినిధి వందనకుమార్కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజుకి ప్రభుదాసు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి, పార్టీని శక్తి వంతంగా నిర్మించేందుకు జగ్గయ్యపేటలో పార్టీ విజయం సాధించే విధంగా కృషి చేస్తానని తెలిపారు.



శ్మశాన వాటిక అభివృద్ధికి శంకుస్థాపన

జగ్గయ్యపేట: నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివద్ది చేస్తుంటే టిడిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం పట్టణంలోని బలుసుపాడు రోడ్డు, ముక్త్యాల రోడ్డులో సుమారు కోటి రూపాయలతో పట్కారి, వడ్డెర, పద్మశాలిల స్మశాన వాటికల అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణంలోని బలుసుపాడు, ముక్త్యాల రోడ్డులలో ఉన్న పట్కారి, వడ్డెర, పద్మశాలిల స్మశానవాటికలను కోటి రూపాయలతో అభివద్ది చేస్తున్నామన్నారు. ప్రహరీ, బోర్లు, గదులు తదితర మౌలికవసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైనది

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైనదని ఎన్‌కెపివివి హిందూ హైస్కూల్స్ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య అన్నారు. వన్‌టౌన్ కొత్తపేటలో గల కెబిఎన్ కాలేజీలో ఎస్ఆర్ఎస్‌వి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌కెపివివి హిందూ హైస్కూల్స్ జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, బీఈడీ కాలేజ్ ప్రెసిడెంట్ ఉసిరిక ఉమామహేశ్వరరావు, సెక్రటరీ గుండా గంగాధర్, జాయింట్ సెక్రటరీ ఎం.వి.కె.హరగోపాల్, కెబిఎన్ కాలేజీ సెక్రటరీ టి.శ్రీనివాసు పాల్గొన్నారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమైందన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడేనని, అటువంటి ఉత్తమ ఉపాధ్యాయులను తయారుచేస్తున్న ఎస్ఆర్ఎస్‌వి కాలేజీ అధ్యాపకులను అభినందనీయులని అన్నారు. తాను కూడా జీవితంలో అనేక సంస్థల్లో సభ్యుడిగా ఉన్నానని, ఎన్నో ఘనతలు సాధించానని, అవన్నీ కేవలం తన


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులు

ఉపాధ్యాయుల కారణంగానే తనకు వచ్చాయని చెప్పారు. గంగాధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.కనకదుర్గ మాట్లాడుతూ కాలేజీకి పూర్వ విద్యార్థులే నిజమైన ఆస్తి అన్నారు. పూర్వ ఉపాధ్యాయుడు బిహెచ్. సాంబశివరావు, డాక్టర్ కె.రామకృష్ణ, డాక్టర్ ఎ. భారతి, ఎన్.పి. మురళీ కష్ణలతో పాటు అధ్యాపకులు అందరినీ పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యార్థులంతా ఎంతో సంతోషంగా తమ కాలేజీ జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.



గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొన్న సంఘటనలో బైకిస్ట్ మృతి చెందిన సంఘటన చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గండ్రాయి రోడ్‌లో చెరువు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన నల్లబోతు హనుమంతరావు (32) జగ్గయ్యపేట నుండి స్వగ్రామమైన గండ్రాయికి బైక్‌పై వెళ్తుండగా షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గండ్రాయి రోడ్‌లో చెరువు మలుపు తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం హనుమంతరావు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో హనుమంతరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని భార్య వినీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో కొండపల్లి మోహన్‌రావు నగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు ప్రారంభమ య్యాయి. ఇందులో భాగంగా ఆదివారం మహిళలు చిన్నారులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు నగర్ మహిళలు మరియు ఐద్వా మహిళా నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయవాడ : పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 33వ డివిజన్‌లోని సత్యనారాయణపురంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం పెన్షన్లను పంపిణీ చేశారు. ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను మూడువేలకు పెంచడం జరిగిందన్నారు.ఈ సదవకాశాన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయిగుంట మల్లేశ్వరి, నాయకులు కె కొండా పాల్గొన్నారు.

రామయ్య వర్ధంతి

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసిన వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంత రావు


నివాళులర్పిస్తున్న దృశ్యం

అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వత్సవాయి సిపిఎం కార్యాలయంలో మాజీ సొసైటీ అధ్యక్షులు నరవనేని రామయ్య ఏడో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పోలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరవనేని రామయ్య సిపిఎం అభివృద్ధికి, వత్సవాయి సొసైటీ అభివద్ధికి ఎనలేని కషి చేశారని అన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో విత్తనాలు, ఎరువులు అందించడంలో ముందంజలో ఉండేవారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ మండల కమిటీ సభ్యులు కంచర్ల కొండయ్య, బి.రాము, వెంకటరత్నం, భూతవల్లి బిక్షం నివాళులర్పించారు.

కృష్ణా హాస్పటల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : నగరంలోని మురళీనగర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో నూతనంగా కృష్ణా హాస్పటల్స్ ఆదివారం ఉదయం ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కాగిత కృష్ణ చంద్, డాక్టర్ మాధురిచే ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనరల్ మెడిసిన్, డయాబెటిస్, గుండె వైద్య సేవలు అందరికీ అందుబాటులో సేవలను అందించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే హాస్పటల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కాగిత నరేంద్రబాబు,వ ఛైర్మన్ డాక్టర్ కాగిత లక్ష్మీ నరేంద్ర, గౌడ సంఘ వైస్ ఛైర్మన్ పోసిన చెంచు రామారావు, పలువురువైద్యులు, వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

బ్యానర్ల ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: టీడీపీ, జనసేన పార్టీల బ్యానర్లు చించివేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దయ్యాల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామంలో టీడీపీ గన్నవరం ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు పర్యటనకు టీడీపీ జనసేన ఐక్యతపేరుతో స్వాగతం పలుకుతూ టీడీపీ, జనసేన నాయకులు ఏర్పాటు చేసిన బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుఝామున కోసివేశారు. పోలీసులకు సమాచారమివ్వడంతో హనుమాన్జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్ధన్, తిరుమలరావులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి, బొబ్బా మోహన్, పొట్లూరి సుధాకర్, గోకుల్, తదితరులు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

కుట్టుశిక్షణ మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నవ చైతన్య కళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అవనిగడ్డ లోని నాలుగో వార్డ్ లో గల మత్స్యకార సంక్షేమ సంఘం భవనంలో కుట్టశిక్షణ రెండో కేంద్రాన్ని ఆదివారం మాజీ ఎంపీపీ బండి నాగ వెంకట కనకదుర్గ ప్రారంభించారు. ఆ సంస్థ చైర్మన్ దిరిశం బాలకోటయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని కనకదుర్గ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివద్ధి చెందుతున్న ఈ కాలంలో పురుషులపై ఆధారపడకుండా ఆర్థిక స్వలంబన స్వయం సమద్ధి సాధించేందుకు ప్రతి ఒక్క మహిళ కషి చేయాలన్నారు. కుట్టుశిక్షణతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నవ చైతన్య కళా సంక్షేమ సంఘం చైర్మన్ బాలకోటయ్య, మోపిదేవి మాజీ ఎంపీపీ మోర్ల విజయలక్ష్మి, టిడిపి మహిళా నాయకులు విశ్వనాథపల్లి పాప, యాసం లంకమ్మ, మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గోవిందరాజులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా వినియోగించడం దుర్మార్గం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అంగన్వాడీల పై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం చాలా దుర్మార్గ చర్యని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ చేస్తున్న నిరసన కార్యక్రమం 26 రోజులు దాటిపోయిన ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారం కోసం ఆలోచించక పోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించి వాళ్ళ హక్కులకు భంగం కలిగించడం బాధాకరమైన విషయం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు

19వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారానికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా అధ్యక్ష, కార్య దర్శుల పి.పోతురాజు , ఎస్.శివ నాగరాజు లు మాట్లా డుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించామని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో ఉపాధ్యక్షులు ఎల్ రాజేష్‌బాబు, ప్రోగ్రామింగ్ కో-ఆర్డినేటర్ ఎం.నాగార్జున, కోశాధికారి ఎం.ప్రశాంతితో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గన్నవరం వికెఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు


గుడివాడలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని వికేఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల (1962 నుంచి 2022) ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా.. పండుగలా ఆదివారం జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు.. స్నేహమేరా జీవితం.. వికేఆర్ కుటుంబం శాశ్వతం.. అంటూ తమలోని ప్రేమను చాటుకున్నారు. మన కలయిక అపూర్వం.. అంటూ నాటి తీపి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఇంకా చెప్పాలంటే ఆప్యాయత పలకరింపులు.. నాటి చిలిపి పనులతో పులకరింపులు.. జోకులతో కేరింతలు.. జీవితంలో సాధించిన విజయాలను పంచుకుని ఆ పాత మిత్రుల కలయికతో, ఎంతో ఆనందంగా నాటి అధ్యాపకులతో కలసి ఆత్మీయ సమ్మేళనం పండుగలా జరిపారు. ఇతర దేశాల నుండి వచ్చిన విద్యార్థులతో పాటు ఇతర రాష్ట్రాలు, ముఖ్య పట్టణాలలో నుంచి, గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులందరూ ఒకే చోట కలిసి పండుగ వాతావరణాన్ని మైమరపించేలా సందడి చేశారు. ముందుగా వేములపల్లి కోదండరామయ్య, లక్ష్మీ అన్నపూర్ణమ్మ దంపతులు, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాసరావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు మూల్పూరి వెంకట లక్ష్మీప్రసాద్, నాదెండ్ల బాలమురళీకష్ణ లు స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్. వి.స్వర్ణకుమారి, రిటైర్డు అధ్యాపకులు మద్దుకూరి విజయకుమార్, డివి. సుబ్బారావు, గన్నె వెంకట్రావు, గాంధీ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మాట్లాడారు. పూర్వ విద్యార్థుల కమిటీ గౌరవాధ్యక్షులు టి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ 2024 నుంచి వీకేఆర్ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు యూనిఫామ్‌ను తానే అందిస్తానని ప్రకటించారు. పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షులు ఎంవిఎల్ ప్రసాద్, పూర్వ విద్యార్థుల కమిటీ కోశాధికారి రాంబాబు, సభ్యులు కొత్తంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక విఎస్ సెయింట్ జోన్స్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1999లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తిరిగి 25 సంవత్సరాల తర్వాత రజతోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలకు వచ్చి సందడి చేశారు. ఒకరినొకరు ప్రేమపూర్వకంగా పలకరించుకుంటూ చిన్ననాటి రోజులను గుర్తు తెచ్చుకుంటూ ఆ తీపి జ్ఞాపకాలను మరొకసారి ముచ్చటిస్తూ ఎంతో ఆనందంగా రెండు రోజులుగా పాఠశాలలో మధురమైన అనుభూతులను తలుచుకుంటూ గడిపారు.

ప్రజాశక్తి - గుడివాడ : ఏరా.. ఏం చేస్తున్నావ్.. ఎలా ఉన్నావ్.. ఎక్కడ ఉంటున్నావ్.. అని తోటి విద్యార్థులు, మాస్టారూ బాగున్నారా.. అని గురువుల్ని ఆప్యాయంగా శిష్యుల పలకరింపులతో అపూర్వ కలయిక ఆద్యాంతం ఉత్సాహంగా కొనసాగింది. 24 ఏళ్ళ క్రితం పదో తరగతిలో విద్యను అభ్యసించిన సహచరులు, విద్యా బోధన చేసిన గురువుల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అడుసుమిల్లి రామకృష్ణయ్య(టౌన్ హైస్కూల్) మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1999-2000 పుర్వవిద్యార్థుల కలయిక ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని టౌన్ హైస్కూల్ వేదికగా నిలిచింది. విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో అపూర్వ కలయికకు వన్నె తెచ్చారు. ఈ సంద ర్భంగా గురువులు ఎస్ఎస్‌విఆర్, శ్రీనివాసరావు, ముక్తేశ్వర రావు, చిన్న వెంకట్రావ్ విద్యార్థులు సత్కరించారు.

రేపటి నుంచి 'జన భగీదరి' : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 19వ తేదీన విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ నేపథ్యంలో ముందస్తుగా 'జన భగీదరి' పేరుతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేదీన 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహము, స్మృతి వనము ఆవిష్కరణ కార్యక్రమం జరుగునుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విగ్రహ ఆవిష్కరణకు ముందుగా ఈనెల 9వ తేదీ నుండి 18వ తేదీ వరకు సంస్మరణ చేసుకుంటూ జన భగీదరి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తతంగా నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందు కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సంయుక్త కలెక్టర్ సభ్య కన్వీనర్ గా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కమిషనర్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి, మెప్మా డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లా విద్యాధికారి సభ్యులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ప్లెక్సీ బ్యానర్ పై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తామని మద్దతు తెలుపుతూ, ప్రతిజ్ఞ చేస్తూ ప్లెక్సీ బ్యానర్‌పై సంతకం చేసేలా చూడాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఒక్కో గ్రామం, వార్డు నుండి ప్రజలు ఐదుగురు పాల్గొనేలా చైతన్య పరచాలన్నారు.

పాఠశాలల అభివృద్ధికి విరాళాలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: సామాజిక అవసరాలను గుర్తించి సేవలందించేందుకు లయనిజమే స్ఫూర్తి అని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వీరమాచినేని రామబ్రహ్మం అన్నారు. బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్లోని లైన్స్ క్లబ్ ఆవరణలో తన ధర్మపత్ని వీరమాచినేని సుశీల జ్ఞాపకార్థం ఆదివారం వివిధ పాఠశాల అభివద్ధికి విరాళాలు అందజేశారు.ఆదిత్య బధిరుల పాఠశాలకు 5వేలు, ఆశాజ్యోతి దివ్యాంగ పాఠశాలకు 5వేలు, పొనుకుమాడు పాఠశాల అభివద్ధి నిమిత్తం 5వేలు అధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి నిర్వాహకులు మరిది వెంకటస్వామి,ఆదిత్య పాఠశాలలో ఆకుల వెంకటరమణ, లయన్స్ రీజనల్ చైర్మన్ నందిగం స్వామి, కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి కళ్లేపల్లి నారాయణరావు, యలమంచిలి రవి, గూడపాటి రత్నశేఖర్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : మానసిక వికలాంగులకు తోడ్పాటు అందాల్సిన బాధ్యత ప్రతిఒక్కరుపై ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. గన్నవరం మండలం దావాజిగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రం లో కష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు కుమారుడు స్వర్గీయ ముక్కామల వెంకట లక్ష్మి శ్రీనివాస్ 15 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం వికలాంగులకు ఆహారం, దుప్పట్లు పంపిణీ చేశారు. డి.యస్.పీ నాదెండ్ల .యస్.బి. మురళి కష్ణ, సంకాబత్తుల రజిత వెంకట్ గన్నవరం నియోజ కవర్గం సి.పి.ఐ కార్యదర్శి పెద్ది వాసుదేవ రావు,గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కష్ణా జిల్లా రైతు సంఘం నాయకులు శనగల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండలమ్మ అమ్మవారి ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాటు పరిశీలించినట్లు తెలిపారు.

పనుల్లేక పస్తులు

- పెరిగిన ఇసుక ధరలు...
- ఆకలి దప్పుల్లో భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - గన్నవరం : ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల భవన నిర్మాణ కార్మికులకు సరిగా పనుల్లేవు. రెక్కాడితే గానీ డొక్కాడని వారంతా ఆకలి దప్పులతో అల్లాడుతున్నారు. అప్పులు చెద్దామన్నా ఎవ్వరూ ఇవ్వడం లేదు. అధిక వడ్డీలకు అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు. ఇసుక సమస్యే దీనికి కారణం. ఇసుక రేటు విపరీతంగా పెరగడంతో పాటు సరిగా అందడం లేదు. దీంతో పనులు జరగడం లేదు. ఎంత కాలం పనుల్లేకుండా ఉండాలో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు. గన్నవరం మండలంలో 30 వేల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. దావాజిగూడెం, గన్నవరం, సావరగూడెం, తెంపల్లి, వీరవనేనిగూడెం, అల్లాపురం, సూరంపల్లి, రాజీవ్నగర్, కేసరపల్లి, ముస్తాబాద గ్రామాల్లో కార్మికులుఎక్కువగా ఉన్నారు. ఇసుక ధరలు విపరీతంగా పెంచేశారు. అది రీచ్లో తగినంత అందుబాటులో ఉండడం లేదు. మూడు నెలలుగా నెలకు కనీసం 10 రోజులు పనులు లేవనీ, భవన నిర్మాణాలు ఆగిపోవడంతో అందరూ ఖాళీగా తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు. వ్యవసాయ వనులకు వెళ్తామంటే అవి కార్మికులకు చేయడం సాధ్యం కాదని వెళ్లడం లేదు. ఏం చే యాలో తెలియని దిక్కుతోచని స్థితి ఉంటున్నారు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదుఃచినబాబు, రాజీవ్ నగర్



నెలలో 20 రోజుల పాటు పనులు లేకుండా ఉన్న పరిస్థితి గతంలో ఎప్పుడూలేదు. ప్రభుత్వం ఏవో సాకులు చెబుతూ ఇసుక అందు బాటులో లేకుండా చేసింది. వేలాది రూపాయలతో ఇసుక కొనడం కష్టమవుతుంది. దీంతో కార్మికులకు పను ల్లేకుండా పోయాయి. తిండి కోసం అప్పులు చేయాల్సి వస్తుంది. ఎన్ని రోజులు ఈవిధంగా ఉండా లో తెలియడం లేదు.

కార్మికులంటే ఎందుకింత నిర్లక్ష్యం: రాము , దావాజిగూడెం



భవన నిర్మాణ కార్మికు లంటే పాలకులకు ఎందు కింత నిర్లక్ష్యం. ఇసుకలో అవినీతి జరుగు తోందని చెబుతూ కార్మికులు నోటి దగ్గర కూడు తీశారు. ఏదో అద్భుతం చేస్తామని చెబుతూ మా బతుకుల్ని రోడ్డు పాల్టేశారు. భుక్తి లేకుండా ఏవిధంగా ఉండాలి. అసలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణం.

వనిలేదు..భుక్తి లేదు: శ్రీనివాసరెడ్డి,



పనిలేదు.. భుక్తి లేదు.. అన్నట్లుగా ఉంది. భవన నిర్మాణాలు ఆగివటంతో ఎక్కడ చూద్దామన్నా పనిలేదు. వేరొక పనికి వెళ్లామంటే రాదు. రాడ్ బిల్డింగ్ పనులు నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఆపనులు ఆగిపోవడంతో ఆకలి దప్పులతో అలమటిస్తున్నాం. వభుత్వం తక్షణం స్పందించాలి.

27వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

మూడో రోజుకు 24 గంటల దీక్షలు

పలు పార్టీల నేతల మద్దతు

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్‌వాడీల సమ్మె 27వ రోజుకు చేరిన సందర్భంగా మూడవ రోజు 24 గంటల దీక్షలను ప్రముఖ డాక్టర్, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ సూరపనేని సుధాకర్ ఆదివారం ప్రారంభించారు. ఎస్మా చట్టం కాపీలను వామపక్ష, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ఇతర రాజకీయ పార్టీల నేతలు ధర్నా చౌక్‌లో దగ్ధం చేశారు. ఎస్మా చట్టం కాపీలను రాష్ట్ర వ్యాప్తంగా దగ్ధం చేయనున్నట్లు నేతలు హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఇ మాణిక్యం, మల్లేశ్వరి, కె రమ్యకుమారి, ఎన్ నీరజ, కె సుభావతి, ఎన్ ఉమ, కె.రత్నకుమారి, టి.స్వామి, ఎ.సంపూర్ణ, ఎస్ శైలజ, సిహెచ్ రుక్మిణి, కంఠీశ్వరి ఈ దీక్షల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి అధ్యక్షత వహించారు. దీక్షా శిభిరాన్ని ఉద్దేశించి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు మాట్లాడుతూ అంగన్వాడీ సమ్మెపై ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండగలోపు అంగన్వాడీ యూనియన్లతో చర్చలు జరిపి వేతనాలు పెంచాలని, లేనట్లయితే రాజకీయపార్టీలు కూడా ప్రత్యక్షపోరాటంలోకి వస్తాయని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రజాతంత్ర హక్కులను కాల రాస్తున్న జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె మిగిలిన కార్మిక వర్గానికి ఆదర్శమైన పోరాటంగా నడుస్తుందన్నారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమా మహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పోలారి, ఎఐటియుసి నాయకులు ఆర్.రవీంద్రనాద్, కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, ఆమ్‌ఆద్మీ, విశ్వజన పార్టీ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రోజా, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, నాయకులు ఎంవి సుధాకర్, కె దుర్గారావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.గజలక్ష్మీ, యల్లారాణి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీదేవి, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ జి.కిషోర్ కుమార్ విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ ధర్నాను సందర్శించి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమ్మెకు సంపూర్ణ మద్దతును సంఘీభావాన్ని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 26 రోజులుగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీల ధర్నాను ఉద్దేశించి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులపై 1971 ఎసెన్షియల్ సర్వీసెస్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ (ఎస్మా), జి.ఒ.నెం.2 జారీ చేసిన ప్రభుత్వ చర్యను ఖండించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ జాయింట్ సెక్రటరీ చిలకలపూడి కళాధర్ మాట్లాడారు. డివిజన్ నాయకులు ఎస్.కె. రహీముద్దీన్, ఎన్.ఎం.కె.ప్రసాద్, బ్రాంచి నాయకులు పాల్గొన్నారు. **మైలవరం :** ఎంపిడిఎ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం అంగన్వాడీ వర్కర్లు, అంగన్వాడీ హెల్పర్లు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, ఐలు నాయకులు ఆర్.రమేష్ బాబులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆర్.పుష్పకుమారి, సిహెచ్.శారద, కే అరుణ, లలిత కుమారి, పద్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** అంగన్వాడీలపై ఎస్మా ప్రకటించటం దుర్మార్గపు చర్యను ఖండిస్తూ ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఆదివారం జి ఓ కాపీలు దగ్ధం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ , సీనియర్ నాయకులు ఎ విఠల్ రావు , ఉపాధ్యక్షులు కొండలరావు, హాకర్స్ యూనియన్ నాయకులు నవీన్, రామారావు, ప్రభుదాస్, లైలా, రమణ తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** 27 వరోజు రోజు ఆదివారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతుంది. ఎస్మా చట్టం రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీలు ఎస్మా ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు ప్రజాసంఘాల నాయకులు ఎస్ నాగమణి దంతాల రాజేశ్వరి కోటా కష్ణ దంతాల నరేంద్ర మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు మధుకుమారి, అంజమ్మ, విశాలాక్షి, సువర్చల, రత్నకుమారి పాల్గొన్నారు. **నందిగామ :** 27వ రోజు సమ్మె రూపంలో నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు,సయ్యద్ ఖాసిం ,వి.రవిశేఖర్ ,జి.గోపినాయక్ డివైఎఫ్ఐ జిల్లా నాయకులు లాల్ సాలయ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సీనియర్ నందిగామ ప్రాజెక్టు కార్యదర్శి కోల్లి సరళ , మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు ఆదివారం నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. తిరువూరు తహశీ ల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ టియు నాయకులు బి.వెంకటేశ్వరరావు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.పద్మ, ఎన్.నాగమణి, ఉష, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలో


తిరువూరు


నందిగామ


మైలవరం


జగ్గయ్యపేట


ఇబ్రహీంపట్నం

భవానీలకు అన్న ప్రసాదం వితరణ


భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - భవానీపురం : విద్యాధర పురంలోని నాలుగు స్తంభాల సెంటర్ ప్రాంతంలో నాగేంద్ర స్వామి బాల భక్త సమాజం ఆధ్వర్యంలో గిరి ప్రదర్శన చేస్తున్న భవానీలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఐదు రోజులుగా బాల భక్త సమాజం అధ్యక్షులు, టిడిపి 39, 44 డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జ్ బడుగు గణేష్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ నేపథ్యంలో గిరి ప్రదర్శన ఐదోరోజు ఆదివారం భవానీలు, వారి కుటుంబ సభ్యులకు అన్న ప్రసాద వితరణ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బడుగు గణేష్ మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా నగరానికి గిరి ప్రదక్షిణకు వచ్చే భవానీలకు తమ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణను అమ్మలగన్నయమ్మ దుర్గమ్మ దయతో నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరి ప్రదర్శన సందర్భంగా రోజుకి 3 వేల నుండి ఐదువేల మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 44వ డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి, నాగేంద్ర స్వామి బాల భక్త సమాజం బాధ్యులు ఆత్మకూరి సూర్యనారాయణ, కట్ట సాంబయ్య, బడుగు సామ్రాజ్యం, బడుగు వాణి , పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌కు పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకున్న రఘునందన్

ప్రజాశక్తి - తిరువూరు : స్వాతంత్ర్య సమర యోధుడు, శతాధిక గ్రంథకర్త, అల్లూరి సీతా రామరాజు చరిత్ర పరి శోధకులు పడాల రామారావు పేరు మీద నెలకొల్పిన స్మారక పురస్కారాన్ని శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వాహకులు తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్య దర్శి రేపాక రఘునందన్‌కు అందజేశారు. సాహిత్య రంగంలో చేస్తున్న కషికి, ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవితచరిత్రను తెలుగు, హిందీ భాషలలో రచించడమే కాక భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా పైడిమర్రి ముఖచిత్రంతో తపాలా కవరును విడుదల చేయించడంలో విశేష కషి చేసినందుకు రఘునందన్‌కు ఈ పురస్కారం అందజేసిన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కళాశాల తెలుగు అధ్యాపకులు పివిబి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలి



మాట్లాడుతున్న శ్రీహరిరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కాలుష్య ప్రభావం నుండి కాపాడు కోవడానికి మొక్కలు పెంచడం అత్యవసరమని సిద్ధార్థ అకాడమి గవర్నింగ్ బాడీ సభ్యులు, మాజీ లయన్స్ గవర్నర్ తాతినేని శ్రీహరిరావు అన్నారు. నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మొక్కల ప్రదర్శనలో లక్కీ డ్రాను ఆదివారం సాయంత్రం ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా 53 మంది విజేతలకు ప్రత్యేక బహుమతులతో పాటు మొక్కలను అందచేశారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ నగర వాసులకు మొక్కలను అందించడమే కాకుండా మొక్కలపై అవగాహన, విద్యార్థులకు పర్యావరణంపై పోటీలను నిర్వహించం పట్ల ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్‌ను అభినందించారు. ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కానూరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజుల నుండి జరుగుతున్న మొక్కల ప్రదర్శనకు నగర వాసుల కాకుండా చుట్టు ప్రక్కల జిల్లాల నుండి కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను తీసుకువెళుతున్నారన్నారు. తమ అసోసియేషన్ మొక్కలపై అవగాహన కల్పించడమే కాకుండా వచ్చిన ప్రతి వారికి ఉచితంగా మొక్కను అందిస్తున్నామని, ఆదివారం ఒక్క రోజునే 53 మంది మెగా లక్కీ డ్రా ద్వారా ఎంపికచేసి ప్రత్యేక బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.వి.వి.సత్యనారాయణ, బి.పి. సంజీవరెడ్డి, సెక్రటరీ టి.శ్రీనివాసరావు, కో ఆర్డినేటర్ కుమార్ లాల్, జాయింట్ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ పాల్గొన్నారు.

జీవితాలకు బంగారు బాట వేసుకోవాలి

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - నందిగామ : గ్రూప్ 2 పరీక్షకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో, పట్టుదల, అవగాహనతో కష్టపడి చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కృష్ణా -గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. నందిగామ యుటిఎఫ్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నందిగామ రైతు పేటలో గల శ్రీ వేంకటేశ్వర ఎసి కళ్యాణ మండపంలో గ్రూప్-టు అభ్యర్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కష్టపడి చదువుకోవాలని కోరారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలికి ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని, ఆలోచన దక్పథంతో, సజనాత్మకతతో చదువు కోవాలని కోరారు. నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి పి.సాయి బాబు మాట్లాడుతూ గ్రూప్ 2 సాధిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కఠోర దీక్షతో చదువు కోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో ప్రపంచ, దేశ,రాష్ట్ర భౌగోళిక పరిస్థితులు, చరిత్ర, మ్యాచ్ మేటిక్స్, జనరల్ నాలెడ్జ్, అర్థమెటిక్స్, కరెంట్ ఎఫైర్స్ వగైరా సబ్జెక్టులపై అవగాహన ఉండాలని కోరారు. నందిగామ మండల తహశీల్దార్ ఎస్.నరసింహారావు, యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బొద్దుకోలు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ జే. గంగరాజు , ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు గోపి నాయక్, డివైఎఫ్ఐ నందిగామ డివిజన్ అధ్యక్షులు ఎస్కే .లాల్ సలాం తదితరులు పాల్గొన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులకు భారత సమాజం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు అనే రెండు స్టడీ మెటీరియల్స్ హాజరైన అభ్యర్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

అనాథ పిల్లలకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని ఎస్.కె.సి.వి.ఛారిటబుల్ ట్రస్ట్ వారి ప్రేమవిహార్ బాలుర అనాథాశ్రమంలో హరివిల్లు ఫౌండేషన్ సభ్యులు, దాతల సహకారంతో 70 మంది పిల్లలకు రెడీమేడ్ దుస్తులను, అరిసెలు, చక్రాలను అందజేశారు. ఈ ఫౌండేషన్ అధ్యక్షులు యం.శశికాంత్ మాట్లాడుతూ తాము ఇప్పటివరకూ రోడ్లపై జీవనం సాగించే నిరాశ్రయులకు పలుమార్లు తమ సభ్యులద్వారా సేకరించిన దుస్తులను అందజేశామని, కానీ ఈ నూతన సంవత్సరంలో తల్లితండ్రులు లేని ఈ పిల్లలకు వారికి నచ్చిన నూతన రెడీమేడ్ దుస్తులను అందజేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలుగచేస్తుందని తెలియచేసారు. ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీ.యు.కనకారావు మాట్లాడుతూ నాలుగేళ్లుగా తమ ఫౌండేషన్ వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ ఈ నూతన సంవత్సరంలో అనాధ పిల్లల కోసం ఏదయినా ఒక మంచి సేవాకార్యక్రమం చేయాలని భావించి ఈ కొత్త సంవత్సరంలో ,పండుగ రోజుల్లో పిల్లలకు కొత్తబట్టలు, అరిసెలు, చక్రాలు అందజేస్తే బాగుంటుందని భావించి తమ సభ్యులకు తెలియజేయగా సభ్యులందరూ ముందుకు వచ్చి తమతోపాటు సేవాభావం కల తమ సన్నిహితుల నుండి విరాళాలు సేకరించి ఇటువంటి సేవా కార్యక్రమం మా హరివిల్లు ఫౌండేషన్ ద్వారా చేయటం మా అదష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి అయిన డాక్టర్ ఎం.వి.శరత్ కుమార్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ పేదలకు ప్రధానంగా అవసరమైన వైద్యం, విద్యకు సంబంధించిన సేవాకార్యక్రమాలు చేయటమే కాక వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు, అనాథాశ్రమాల్లో పిల్లలకు భోజన వితరణ కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ రఫీ, కార్యవర్గ సభ్యులు ఎం.బాలసూర్యనారాయణ, ఎం.శ్రీదేవి, గ్రంధి అప్పలరాజు, ఎం.వి.ఎస్.ఎన్.ప్రసాద్, నజీర్ అహ్మద్, కె.సుబ్రమణ్యం, కిరణ్, .ఎన్.ఉషాదీప్తి, .ఎం.డి. ఇర్షాద్, ఎం.రామకష్ణ, తదితరులు పాల్గొని పిల్లలకు దుస్తులు, స్నాక్స్ అందజేశారు.



27వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె


గుడివాడలో...


కంకిపాడులో...


మచిలీపట్నంలో...

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయలపై రాష్ట్రంలోని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పన్నే కుట్రలు, కుతంత్రాలు ఐక్యంగా తిప్పి కొట్టాలని సిఐటియు కృష్ణా జిల్లా మాజీ కార్యదర్శి వై. నరసింహారావు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారించాలని కోతరుఊ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరుకుంది.అలాగే 24 గంటల రిలే నిరాహారదీక్షలు రెండో రోజు కు చేరుకున్నాయి.ఈ సందర్భంగా సమ్మె,దీక్షలకు సంఘీ భావం తెలిపిన వై నరసింహారావు మాట్లాడుతూ గత 26 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తుందన్నారు. 26 రోజులుగా శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీలను ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మెను నిషేదించడం అప్రజాస్వామికమన్నారు. తక్షణమే జివో ను ఉపసంహరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా అద్యక్షులు సి హెచ్ రాజేష్, సిఐటియు మచిలీపట్నం మండల కార్యదర్శి సిహెచ్ జయ రావు,లు సంఘీ భావం తెలిపిన ఈ సమ్మెలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏ.రమాదేవి, కమిటీ సభ్యులు కే లక్ష్మి ,సుజాత, సౌజన్య విటలేశ్వరి పాల్గొన్నారు. **ప్రజాశక్తి, గుడివాడ రూరల్:** అంగన్‌వాడిలపై ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమైన చర్యగా సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అభివర్ణించారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడిలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 27వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అంగన్‌వాడిల పై ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు కార్యదర్శి బివి శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు రజని, యూనియన్ అధ్యక్షురాలు యోండూరి గీత, కార్యదర్శి తూమేటి వాణి, నందివాడ, గుడ్లవల్లేరు సెక్టార్ నాయకురాళ్లు మేరి, అమ్మాజి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు ప్రాజెక్టు కమిటీ వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 27 రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాడంకి నరేష్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు నళిని కుమారి, ఎం రేవతి, సెక్టార్ లీడర్ రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి ,ఎం కనకరత్నం, కాళిమ్మ, విజయలక్ష్మి, నాయకులు లక్ష్మీప్రసన్న,, భవాని, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.**పామర్రు** : పామర్రులో అంగన్‌వాడీ శిబిరంలో ప్రాజెక్టు నాయకురాలు కె.ఉమారాణి మాట్లాడారు. టిడిపి నాయకులు దాలిపర్తి ప్రసాద్, మంతెన రామాంజనేయులు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు గంగాధర్, ఐ.రాజు, ఎం. విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ నిర్వీర్యానికి కుట్ర



ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో గుండా బత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో 'ఐసిడిఎస్ పరిరక్షణకై ప్రజలు ప్రజాసంఘాల బాధ్యత' సదస్సు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై. నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ 1975లో ఈ ఐసిడిఎస్ వ్యవస్థ ప్రారంభించారని, ఈ పథకం వల్ల బాలింతలు చంటి పిల్లలు గర్భిణీల మరణాలు తగ్గాయన్నారు. సుప్రీంకోర్టు ఈ పథకాన్ని మొత్తం దేశమంతా ఏర్పాటు చేయాలని చెప్పిన తర్వాత భారతదేశం మొత్తం కూడా ఈ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసి అంగన్వాడి వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అయితే కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఐసిడిఎస్ వ్యవస్థని నాశనం చేయాలని చూస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ఉపయోగించడం దారుణమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో శ్రామిక మహిళ కన్వీనర్ ధనశ్రీ, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు బుర్ర రత్నకుమారి, మాజేటి శివ, శ్రీనివాసరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు లంకదాసు అజయ్ గోస్ట్, బొడ్డు నాగరాజు, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాజేటి పద్మ, లంకదాసుల సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రశేఖర్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమ్మలపాటి రవి పాల్గొన్నారు

ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : స్థానిక ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ చేశారు. బుట్టాయిపేట శ్రీమతి అన్నం వీర రాఘవమ్మ, రాఘవరావు కళ్యాణమందిర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర ఇస్కాన్ ప్రతినిధి నందగోపాల్ దాస్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే ఆధ్యాత్మికను పెంపొందించు కోవాలన్నారు. అనంతరం 89 మంది విద్యార్థులకు రూ.1,20,000 ఉపకార వేతనాలుగా అందించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రతినిధి నందగోపాల్ దాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సన్నిధి నాగసాయి శ్రీనివాస్, ఫైనాన్షియల్ అడ్వైజర్ చలువాది లీలా దుర్గా కోటేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.అవోపా మచిలీపట్నం శాఖ అధ్యక్ష కార్యదర్శులు నంబూరి గోపాలకష్ణ, నంబూరు చలపతిరావు, అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

- ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి కలక్టరేట్(కృష్ణా) : ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న 125 అడుగుల ఎత్తు కలిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక ఆర్ అండ్ బి అతిథి గహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి విజయవాడలో నూతనంగా రూపుదిద్దుకున్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణపై మాట్లాడారు. నాలుగు వందల కోట్ల రూపాయలతో స్వరాజ్ మైదానంలో రూపుదిద్దుకున్న అంబేద్కర్ స్మృతి వనంలోని విశిష్టతలను ఆయన వివరిస్తూ విగ్రహం మాత్రం 125 అడుగులు ఎత్తు కలిగి ఉంటుందని, మరో 80 అడుగులు గల విగ్రహం కింది భాగంలో మూడు వేల మంది కూర్చోగలిగే మల్టీ కన్వెన్షన్ హాల్, 2 వేల మంది ఆసీనులు కాగల ఓపెన్ థియేటర్, బుద్దిస్ట్ మెడిటేషన్ హాల్, ఫౌంటెన్లు, పార్కు వంటి అన్ని రకాల సదుపాయాలతో కనీవినీ ఎరుగని రీతిలో అద్భుతంగా నిర్మించారన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-పెడన : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి కలిసి పోరాడి విజయం సాధించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీలకతీతంగా కషిచేస్తూ ప్రభుత్వ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా జనసైనికులు టిడిపి కార్యకర్తలు ముందుకెళ్లాలని ఆయన ఎంతో పలికారు. ఆదివారం పట్టణ పరిధిలోని తొమ్మిదవ వార్డులో ఉన్న ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ సురేష్,పెడన పట్టణ మండల అధ్యక్షుడు టిడిపి అధ్యక్షుడు శలపతిప్రసాద్, జడ్పిటిసి సభ్యులు అధ్య వెంకట మహేష్ పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం లోని స్తానిక్ నోబుల్ కళాశాల క్రీడా మైదానంలో హాకీ ఎంపిక పోటీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెలక్షన్స్ ద్వారా ఎంపిక అయిన కష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించే జట్టు వివరాలను తెలిపారు. కెప్టెన్ గా కే ఎస్ సాగర్,జట్టు సభ్యులుగా ఎం సాయి మనోహర్ ,పి జశ్వంత్ డి తరుణ్ కుమార్, కె ఆకాష్, జి లోకేష్, ఏ మహేశ్వర మాధవరావు,బి సాయి కిషన్ రెడ్డి, ఏ దేవనాద్,ఎండి తన్వీర్,ఎస్ భరత్ కుమార్,వి హర్షర్ధన్ ,ఏ రుషికేశ్ నాయుడు,వి హేమ చంద్ర, తేని నాగేంద్ర వర్మ,ఎం తన్మమై శివ వేణు,వి చేతన్ అమర్నాథ్,బి శివ సతీష్ బాబు, స్టాండ్ బై ఆటగాళ్ళు గాబి టీ ఎన్ వి యస్ పి రామ్చరణ్, జి ధరణి సాయి,జి ఉదయ్,ఎం నవ నందన్ ఈశ్వర్ ఎంపికైనట్లు తెలిపారు.ఈ జట్టు తిరుపతిలో 9వ తేదీ నుండి నిర్వహించే 14వ ఏపీ జూనియర్ బాలుర హాకీ చాంపియన్షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ జాయింట్ సెక్రెటరీ శ్రవణం రామకష్ణ పరమహంస పాల్గొన్నారు. హాకీ కష్ణ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సన్నిధి నాగ సాయి శ్రీనివాస్, కార్యదర్శి శ్రవణం హరికష్ణ, కోశాధికారి బి విటల్ మరియు అసోసియేషన్ సభ్యులు అత్మూరి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గ పరిధిలోని ఘంటసాల అవనిగడ్డ చల్లపల్లి మండలాలకు చెందిన నలుగురు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు అందజేశారు. ఘంటసాల కు చెందిన ఒకరికి రూ లక్ష ఇరవై వేల చెక్కును, అవనిగడ్డ కు చెందిన ఒకరికి ఐదు లక్షల 50 వేల చెక్కును, చల్లపల్లి కి చెందిన ఇరువురి వ్యక్తులకు 265 వేల చెక్కులను మొత్తం తొమ్మిది లక్షల 35 వేల విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ యూత్ అధ్యక్షులు చింతలపూడి బాలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


జీవో కాపీలను దహనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - గుడివాడ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరసన ధర్నా ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న కార్మికులపై యస్మా ప్రయోగించడం దారుణమని మండిపడ్డారు.ఈ సందర్భంగా యస్మా జీవో నెంబర్ 2 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీవో కాపీలను కార్మికులు మంటల్లో వేసి దగ్గం చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేపాని కొండ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొట్టె వెంకట్రావ్‌కు ఉత్తమ రైతు అవార్డు



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంకు చెందిన జనసేన నాయకులు కొట్టె వెంకట్రావ్ ఉత్తమ రైతు అవార్డు దక్కించుకున్నారు.కోస్తా తీర ప్రాంతంలో 365 రోజులు పంటలు పండేలా గత సంవత్సరం కొత్తపూడిలోని తన వ్యవసాయ భూమిలో భూమికి సమాంతరంగా బోరు వేసి సఫలీకతుడైన వెంకట్రావ్ కు రాజంపేటలోని ఐ ఎస్ టి ఎస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఉత్తమ రైతు అవార్డుతో సత్కరించింది.శనివారం ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జె ఎన్ టి యు డైరెక్టర్ రామిరెడ్డి, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ ఉపేంద్ర రెడ్డి చేతుల మీదుగా వెంకట్రావ్ ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. తనకు ఈ అవార్డు రావడం పట్ల వెంకట్రావ్ సంతోషం వ్యక్తం చేశారు. కోస్తా తీరంలో వర్షాధారంతో ఒక పంట మాత్రమే రైతులు పండించుకుంటున్నారని ఈ బోర్ ద్వారా 365 రోజులు ఎన్ని ఎకరాల్లోనైనా కావల్సినంత నీటిని తీసుకుని పంట పండించుకోవచ్చని తెలిపారు.ఈ బోరు వేయాలనుకునే వారు తనను సంప్రదిస్తే దగ్గర ఉండి మరీ బోరు వేయిస్తానని వెంకట్రావ్ రైతులకు హామీ ఇచ్చారు.

కెసిపి విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఒకసంస్థలో పని చేసి ఉద్యోగ విరమణ అనంతరం ఎక్కడెక్కడో నివసిస్తున్న అందరూ కలసి ఆహ్లాదకరంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం సంతోషకరమని ప్రముఖ వైద్యుడు చలమలశెట్టి శివరామకృష్ణారావు అన్నారు. స్థానిక శరత్ నర్సింగ్ హెూమ్ ఆ వరణలో ఆదివారం జరిగిన కేసీపీ షుగర్స్ ఉయ్యూరు యూనిట్ వ్యవసాయ విభాగం విశ్రాంత ఉద్యోగుల తతీయ ఆత్మీయ సమ్మేళణంలో ఆయన విశిష్ట అతిథిగా పా ల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉయ్యూరుకు తలమానికమైన కేసీపీ షుగర్స్ కర్మాగారంలో వ్యవసాయ విభాగంలో ఉద్యోగం చేసి చెరకు రైతులకు సేవలందించిన విశ్రాంత ఉద్యోగులు ప్రతి సంవత్సరం ఒక చోట కలసుకుని యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడపడం మంచి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా 75 సంవత్సరాలు వయస్సు దాటిన చలమలశెట్టి వీర కోటేశ్వరరావు, మేరుగ సత్య నారాయణ, వడ్డే బాలాజీ, కోడె సాంబశివరావు, చింతా కోటేశ్వరరావు, కర్లపూడి శ్రీరాములు, శివరామకష్ణారావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.



ఆందోళనకరంగా విద్యుత్ ప్రమాదాలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

సిపిడిసిఎల్ విజయవాడ సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలు ఆందోళనకరంగా మారాయి. ప్రతి ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకుని విగత జీవులుగా మారుతున్నారు. మూగ జీవాలైన పశువులు శవాలుగా మారుతున్నాయి.

పెద్ద ఎత్తున ప్రాణ నష్టం

2022లో మొత్తం 48 విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో 24 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఒకరు తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. దాదాపు గేదెలు, ఆవులు వంటి 23 మూగ ప్రాణులు బలై పోయాయి. 2023లో వీటి విద్యుత్ ఘాతాల సంఖ్య పెరిగింది. 73 విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో 66 ఘటనలు అత్యంత ప్రమాదకరమైనవి. విద్యుత్ ఘాతానికి గురై దాదాపు 32 మంది నిండు ప్రాణాలు పోగొట్టుకున్నారు. సుమారు 34 పశువులు మరణించాయి. మరో ఏడు ఘటనలలో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. అదృష్ట వశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం సంభవించ లేదు.

విజయవాడ డిజన్లలోనే ఎక్కువ

విజయవాడ సర్కిల్ కింద విజయవాడ టౌన్ డివిజన్‌తో పాటు విజయవాడ రూరల్, గుణదల, గుణదల, నూజివీడు, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరుతో కలిపి ఏడు డివిజన్లు ఉన్నాయి. ఎక్కువగా విజయవాడ రూరల్‌తో పాటు విజయవాడ టౌన్, నూజివీడు డివిజన్లతో పాటు జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిజ నిర్ధారణ నిమిత్తం

మరో వైపు ప్రమాదాల కారణాలు, వైఫల్యాల నిజ నిర్ధారణ నిమిత్తం విజిలెన్స్ విభాగానికి అప్పగిస్తున్న కేసుల సంఖ్య కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉంటున్నాయి. అన్ని డివిజన్లలోను ఈ కేసులు ఉంటున్నాయి. 2022లో 31 కేసులను అప్పగించగా 2023లో కూడా దాదాపు 32 కేసులను అప్పగించారు. వీటిల్లో దాదాపు 60 శాతం కేసులు సిబ్బంది నిర్లక్షం వల్ల, తక్కిన 40 శాతం కేసులు అవగాహన లేక పోవడం వల్ల జరిగాయని నివేదించినట్లు తెలిసింది.

సంవత్సరం	ప్రమాదాలు	మనుషులు	పశువులు
2022	48	24	23
2023	73	32	34

నిర్లక్షమే ప్రధాన కారణం

అధికారులు, సిబ్బంది నిర్లక్షం కారణంగా ప్రమాలకు కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నా అధికారులు, సిబ్బందిలో మాత్రం చలనం ఉండటం లేదు. దీంతో మనుషులు, పశువులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పలువురు ఆక్షేపిస్తున్నారు.
విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, ఇళ్ల పొలాల్లో చేతులకు అందేంత ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నా పట్టించుకోవడం లేదు. మరమ్మతులు చేపట్టడం లేదు.

ఒకే స్తంభానికి వేర్వేరు ఫీడర్ల లైన్లు

ఒకే స్తంభానికి వేర్వేరు ఫీడర్ల నుంచి వచ్చే విద్యుత్ లైన్లను లాగడం అలవాటై పోయింది. దీంతో ఏలైన్‌లో కరెంట్ ఉంటుందో, ఏ లైన్‌లో కరెంట్ ఉండటం లేదో పెద్ద సంధిగ్దత నెలకొంటోంది. మరమ్మతుల పేరుతో ఒక లైన్‌లో కరెంట్ సరఫరా నిలపి వేసినా, రెండో లైన్ నుంచి విద్యుత్ ప్రసారం అవుతుండటంతో ప్రమాదాలకు ఇదే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఒక ప్రాంతంలోని కనెక్షన్లను ఒక ఫీడర్ పరధిలోకి తీసుకొని రావడంలో ఘోర వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

కొరవడిన లైన్ పెట్రోలింగ్

విద్యుత్ లైన్లు ఎలా ఉన్నాయి, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అనే దానిపై నిత్యం లైన్ పెట్రోలింగ్ ఉండాలి. తెగిపడిన తీగలు, వ్రేలాడుతున్న లైన్లు, అందేంత ఎత్తులో ఉన్న వైర్లను ఎప్పటికప్పుడు వాటిని సరిచేసే మరమ్మతులు చేపట్టాలి. ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇలాంటి పనలు చేపట్టాలి. లైన్ మెన్లు, జూనియర్ లైన్ మెన్లు, ఇతర సిబ్బందితో లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలి. దీనిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సాగించాలి. కానీ ఎక్కడా కూడా ఇవి కార్య రూపం దాల్చడం లేదు.

నో అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్

విద్యుత్ ప్రమాదాలపై ప్రజల్లో, రైతుల్లో అవగాహన కల్పించాలి. ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, గృహాల కనెక్షన్‌లతో పాటు పొలాల్లో విద్యుత్ మోటార్ల విద్యుత్ కనెక్షన్లపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపైన అవేర్‌నెస్ కార్యక్రమాలు చేపట్టాలి. కానీ ఆ దిశగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రమాదాలు అనివార్యంగా మారిపోతున్నాయి.



19 గ్రామాలకు వాటర్ ట్యాంకులు అందజేత

ప్రజాశక్తి-విజయవాడ: మైలవరం నియోజకవర్గం, రెడ్డిగూడెం మండలం, జి కొండూరు మండల పరిధిలోని 19 గ్రామాల తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా 19 వాటర్ ట్యాంకర్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం కేశినేని భవన్ వద్ద ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా పని చేసుకుంటూ వెళ్లడమే తమ లక్ష్యమన్నారు. చివరి శ్వాస వరకు విజయవాడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో 288 గ్రామాలకు వాటర్ ట్యాంకర్లను అందజేయబోతున్నామన్నారు. దానిలో భాగంగా ఇప్పటికే 150 వాటర్ ట్యాంకర్లను అందజేశామన్నారు.

మొదటిపేజీ తరువాయి

'పది' ఫలితాలు మెరుగయ్యేనా?

పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ సహాయంతో స్టడీ మెటిరీయల్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పది చదివే విద్యార్థులను మూడు గ్రేడ్‌లుగా విభజించారు. బిలో యావరేజ్, యావరేజ్, ఎబో యావరేజ్ కేటగిరీలుగా విద్యార్థులను విభజించారు. పాఠశాల సమయం పూర్తయిన తర్వాత 4.30 నుంచి 6 గంటల వరకు వీరందరికి ప్రయివేటు క్లాసులు నిర్వహిస్తున్నారు. చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వారం, 15 రోజులకు ఒకసారి సబ్జెక్టుల వారీగా టెస్టులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులోకి రాని స్నాక్స్

పాఠశాల సమయం పూర్తయిన తర్వాత 4.30 నుంచి 6 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రత్యేక క్లాసుల్లో ఎక్కువ సమయం చదివే విద్యార్థులు ఆకలి, ఆలసట గురవ్వకుండా సాయంత్రం స్నాక్స్‌ను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో జిల్లా పరిషత్ నుంచి స్నాక్ అందిస్తారని అధికారులు చెబుతున్నా ఇప్పటికి ఆచరణకు నోచుకోలేదు.

గతేడాది రాష్ట్రంలో 11 స్థానం

2022-23 విద్యాసంవత్సరంలో 19,670 మంది పరీక్షలు రాయగా 14,688 మంది 74.67 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో రాష్ట్రంలో కృష్ణాజిల్లా 11వ1 స్థానంలో ఉంది. 11,987 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తే 6,742 మంది 67.42 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 21 పాఠశాలల్లో ఉత్తీర్ణత 50 శాతంలోపు ఉంది. ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులు 8,583 మంది పరీక్షలు రాయగా 7,944 మంది 92.58 శాతం ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వైసిపి పాలనలో అందరూ బాధితులే...

క్యూసెక్కుల గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని, వీటికి అడ్డుకట్ట వేసి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించాలని ఆనాడు పనులు ప్రారంభించామన్నారు. జగన్ ప్రభుత్వంలో కనీసం కాలవలు పూడికతీతకు కూడా నోచుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం, పిట్టలవారిగూడెం ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తామన్నారు. గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం, ఏ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు చేపడతామని హామీనిచ్చారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి కాదని భక్షక నిదని చంద్రబాబు విమర్శించారు. భూములు, రెవిన్యూ ఆస్తుల సెటిల్మెంట్లలో రక్షణనిధి అక్రమాలకు పాల్పడుతూ నియోజవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు.

చంద్రబాబు బహిరంగ సభకు విజయవాడ పార్లమెంటు పరిధిలోని తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ ప్రాంతాల నుంచే కాకుండా సరిహద్దు తెలంగాణ జిల్లాల నుండి టిడిపి కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. బైపాస్ రోడ్డు మొత్తం పసుపుదళంతో కిక్కిరిసిపోయింది. సభకు విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్, తిరువూ రు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్ నల్లగట్ల సుధారాణి గైర్హాజరయ్యారు. సభలో కేశినేని నాని కోసం కుర్చీని కేటాయించారు. అయితే కేశినేని సభకు రాకపోవడంతో ఆయన మద్దతుదారులు కూడా సభకు దూరంగా ఉన్నారు. సభలో ఎన్‌టిఆర్ ఫొటో ఉన్న బ్యానర్లు, జెండాలను టిడిపి కార్యకర్తలు ప్రదర్శించారు. ఈ సభలో ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, గద్దె రామ్మోహనరావు, టిడిపి నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు, బోండా ఉమా, వర్ల రామయ్య, శ్రీరామ్ తాతయ్య, కేశినేని చిన్ని, సేవల దేవదత్తు, బుద్దా వెంకన్న, తంగిరాల సౌమ్య, జనసేన నాయకులు పోతిన వెంకటమహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సమగ్రాభివృద్ధికి చర్యలు

ఎక్సెల్‌ప్లాంట్ తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా వచ్చిన నిధులు ఎన్ని?
14వ ఆర్థిక సంఘం నుంచి రూ.30 కోట్లు బ్యాలెన్స్ నిధులు వచ్చాయి. అలాగే 14వ ఆర్థిక సంఘం గత ఐదేళ్ల కాలానికి సంబంధించి వచ్చిన రూ.340 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు అయ్యాయి. ప్రస్తుతం రెండు సంవత్సరాల నుంచి 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరు అయిన రూ.62 కోట్లు చేసిన వివిధ వర్క్సుకు సర్దుబాటు జరిగింది.

ప్రశ్న: నిధుల ద్వారా ఏఏ వర్క్సు చేపట్టారు?
కొండ ప్రాంత ప్రజల కోసం నాలుగు రిజర్వాయర్ల నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. ఏడెనిమిది మాసాల్లో వీటి పనులు పూర్తవుతాయి. లారీ స్టాండ్ వద్ద, రామలింగేశ్వర్‌నగర్, సర్కిల్-2 పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక్కొక్క రిజర్వాయర్ నిర్మాణం అంచనా వ్యయం రూ. మూడు నుంచి నాలుగు కోట్ల వరకు ఉంటుంది.

ప్రశ్న: ఎక్సెల్‌ప్లాంట్ వద్ద పార్కు అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి?
పది ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పార్కుకు 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.4 కోట్లు ఖర్చుతో కాపౌండ్ వాల్, లైటింగ్, గ్రావెల్ తోలడం జరిగింది. 15వ ఆర్థిక సంఘం నుంచి మరో ఐదారు కోట్లతో మిగిలిన పనులు పూర్తవుతున్నాయి.

ప్రశ్న: రాఘవయ్య అండ్ అంబేద్కర్ పార్కు అభివృద్ధి ఎలా జరుగుతుంది?
14వ ఆర్థిక సంఘం నుంచి సుమారు రూ. మూడు కోట్ల వరకు ఖర్చు జరిగింది. పనులు మొత్తం పూర్తయ్యి పార్కు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చింది.

ప్రశ్న: వన్‌టౌన్ స్టేడియం నిర్మాణం తీరును వివరించగలరు?
వన్‌టౌన్‌లోని స్టేడియం నిర్మాణం కోసం రూ.ఆరు కోట్లు అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం దాని కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి కావడంతో పాటు మిగిలిన పనులు కూడా ప్రారంభించడం జరిగింది.

ప్రశ్న: బందర్ రోడ్డుకిరువైపుల బ్యూటిఫికేషన్ పనుల కోసం ఎంత నిధులు వెచ్చిస్తున్నారు?
బందర్ రోడ్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దానిలోభాగంగా రోడ్డు కిరువైపులా 8 కిలోమీటర్లు పొడవున స్టేట్ నిధులతో రూ.8 కోట్లతో గ్రానైట్‌తో బ్యూటిఫికేషన్ పనులు పూర్తి అయ్యే దశకు చేరాయి.

ప్రశ్న: ఎయిర్‌పోర్టు కారిడార్ పనులకు నిధులు కేటాయింపు ఎంత?
విజయవాడ రామవరప్పాడు నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ 8+8 (16) కిలోమీటర్లు పొడవున దాని నిర్మాణపు పనులకు రూ. 15 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. ఈ పనులు కూడా చివరి దశకు చేరాయి.

ప్రశ్న: 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కింద ఎన్ని వర్క్సు చేపట్టారు?
'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞాపనల ఆధారంగా 348 వర్క్సు పెట్టడం, వాటి కోసం రూ.45 కోట్లు కేటాయింపులు జరిగాయి. జరిగిన వర్కర్స్‌లో రూ.నాలుగు కోట్ల విలువ కల్గిన 46 బిల్స్‌కు 25 బిల్స్‌కు సంబంధించి రూ.రెండున్నర కోట్లు మేర జమలు కాగా, మరో రెండున్నర కోట్ల మేర చెల్లించాలి.

ప్రశ్న: నగరంలో ఎన్ని అర్బన్‌హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగింది, మొత్తం ఎన్ని?
ఇప్పటి వరకు 11 సెంటర్లు నిర్మాణం పూర్తి అయ్యి పలు సెంటర్లలో ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. వీటి నిర్మాణానికి ఒక్కొక్క దానికి రూ.కోటి ఖర్చయ్యింది.

ప్రశ్న: విఎంసి కొత్త బిల్డింగ్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎంత బడ్జెట్ కేటాయించారు?
సుదీర్ఘకాలంగా వినియోగంలోకి రాని విఎంసి నూతన బిల్డింగ్‌లోని మొదటి ఫ్లోర్‌ను విఎంసి అవసరాల కోసం వినియోగించుకోవడానికి అన్ని రకాల పనులు జరుగుతున్నాయి. మూడు కోట్ల వరకు జనరల్ ఫండ్‌ను కేటాయించాం.

ప్రశ్న: విఎంసి క్యాంటిన్ నిర్మాణానికి ఎంత వెచ్చిస్తున్నారు.?
ప్రధాన కార్యాలయంనకు వచ్చే ప్రజలకు, విఎంసి ఉద్యోగులకు పర్మినెంట్‌గా ఒక క్యాంటిన్ అవసరం రీత్యా రూ.40 లక్షలు వెచ్చించి జి+1 నిర్మాణం జరుగుతుంది. ఈ భవనం నిర్మాణం పూర్తయ్యింది. త్వరలో ప్రారంభం అవుతుంది.



పర్యాటక ప్రదేశంగా అంబేద్కర్ స్మృతివనం : శ్రీలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ: పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటక ప్రదేశంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మృతివనం మారనుందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్మృతివనం పనులను ఆదివారం వారు పరిశీలించి మాట్లాడుతూ పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయని, ఈనెల 19న ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. స్మృతివనాన్ని రాష్ట్ర సిఎం జగన్ ప్రారంభిస్తారని చెప్పారు.

జనసేన నాయకుడు గౌరీశంకర్‌పై దాడి

ప్రజాశక్తి-వన్‌టౌన్: కొత్తపేట బ్రాహ్మణ వీధిలో నివసించే జనసేన పార్టీ స్థానిక నాయకుడు వేంపల్లి గౌరీ శంకర్ పై 47వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ గోదావరి, ఆమె భర్త బాబు దాడి చేసి కొట్టడంపై ఆదివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిరువూరు చంద్రబాబు సభలో గోదావరి, బాబు వెళ్లి అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న వీడియో గౌరీశంకర్ వాట్సాప్‌కు వచ్చింది. దాన్ని గౌరీశంకర్ కొంతమందికి పంపించాడు. మూడు గంటల తరువాత గోదావరి బాబు గౌరీశంకర్‌కు ఫోన్ చేసి వీడియో డిలీట్ చేయాలని, ఎక్కడ ఉన్నావు అని అడిగాడు. దీంతో గోదావరి, బాబు, అతని కుమారుడు నితిన్ వచ్చి గౌరీశంకర్‌పై దాడికి పాల్పడి కొట్టారు. దీనిపై జనసేన నగర అధ్యక్షులు, పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన వెంకట మహేష్ బాధితులతో కలిసి వెళ్లి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రజాశక్తి

జిల్లా వార్తలు 7

సోమవారం 8 జనవరి 2024

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ'



యర్లగడ్డకు గుర్రపుబండిపై స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని గన్నవరం ఇన్చార్జి' యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం మడిచర్ల గ్రామంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వ యకర్త చలమలశెట్టి రమేష్ బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. మడిచర్లలో యార్లగడ్డ వెంకట్రావుకు రైతులు ట్రాక్టర్ల ర్యాలీతో, నిమ్మకాయల గజమాలతో ఘనస్వాగతం పలికారు. గ్రామ కమిటీ ఏర్పాటు చేసిన గుర్రపుబండిపై యార్లగడ్డ స్వయంగా నడుపుతూ యువతకు ఉత్సాహాన్ని కలిగించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వాటిని కూడా తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటూ కూడా రైతు భరోసా పేరుతో బటన్ నొక్కినా రైతుల ఖాతాల్లోకి నగదు జమవ్వట్లేదని ఎద్దేవా చేశారు. అయిల్పామ్, డ్రిప్ ఇరిగేషన్ లాంటి వాటిని ప్రోత్సహించే విధంగా టీడీపీ హయాంలో ప్రోత్సాప ాకాలను ఇంతవరకూ ఇవ్వలేదని కొందరు రైతుల రైతులు యార్లగడ్డ దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పుట్టా సురేష్, కార్యదర్శి భూక్యా రంగారావు, దేవినేని సత్యన్నారాయణ, మోటూరి శ్రీనివాస్, కూకటి దుర్గారావు, భూక్యా దావీదు, తానంకి ఇజ్రాయేలు, కాలి శ్రీధర్, తెనాలి జోజిబాబు, కాలీ రాజేష్, గోపి, గొరిపర్తి నాగరాజు, కుపసాటి బాలయేసు తదితరులతో పాటు యార్లగడ్డ వెంకట్రావు సోదరులు యార్లగడ్డ సతీష్,అళ్ళ వెంకట గోపాల కష్ణారావు, మూల్పూరి సాయి కళ్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, కాటూరి విజయ్ భాస్కర్,జనసేన మండల అధ్యక్షుడు వడ్డీ శివ నాగేశ్వరరావు,వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ నాలుగో వార్డులో టిడిపి జనసేన పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకంటే శ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టో హామీలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే కనకదుర్గ, తెలుగు మహిళా నాయకులు విశ్వనాథపల్లి పాప, యా సం లంకమ్మ, కమ్మిలి అన్నపూర్ణ, పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్నంలోని హిందూ కళాశాల హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం విద్యార్థినులకు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధాన సభలో రూరల్ ఎస్సై పద్మ అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలి అన్నారు. ప్రముఖ న్యాయవాది, అజ్మతున్నీసా బేగం మాట్లాడుతూ విద్యార్థినులు వేటికీ ఆకర్షితులు కాకుండా విద్యను అభ్యసించాలన్నారు. శ్రీకాకుళం రేణుకా దేవి, విజయశ్రీ పాల్గొన్న విద్యార్థు ను లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు, హిందూ కళాశాలల రిటైర్డ్ ప్రిన్సిపల్, ఏ ఆర్ కె మూర్తి, బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, వింజమూరి శివరాం, కోశాధికారి, మోపార్తి సుబ్రహ్మణ్యం, కందుకూరి సత్యనారాయణ శర్మ, జమ్మలమడక సేతురామయ్య పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన' : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కనుక ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతుల హక్కులను కాలరాస్తే ఉద్యమం : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అనాదినం భూముల రైతులకు ఉన్న హక్కులు తొలగిస్తే ఉద్యమిస్తామని ఉజనసేన అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషబాబు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో అప్పటి టిడిపి ప్రభుత్వం జీవో నెంబర్ 575 తీసుకువచ్చి సెక్షన్ 22 ఏ నిషేధిత భూముల జాబితా నుండి అనాధీనం కేటగిరి భూములను తొలగించాలని అధికారులను ఆదేశిస్తే గడచిన నాలుగున్నర సంవత్సరాల నుండి ఈ వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ఆ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించక పోగ ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే పేరుతో ఇప్పటికే రైతులకు ఉన్న హక్కులను తొలగించడం అత్యంత దారుణం అని తెలిపారు. 22 ఏ నిషేధిత భూముల జాబితా నుండి ఎన్నో వేల ఎకరాలను తొలగించామని గొప్పలు చెప్పుకుంటున్న ఎమ్మెల్యే రమేష్ బాబు రీసర్వే వల్ల అనాధీనం భూములు రైతులు ప్రత్యక్షంగా నష్టపోతుంటే చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కలగజేసుకొని రెవిన్యూ మంత్రి అధికారులతో మాట్లాడి రైతుల పేర్లు ఆన్లైన్ అడంగల్ నందు తొలగించకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని శేషబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, పార్టీ నాయకులు పప్పు శెట్టి శ్రీను, ఆకుశెట్టి రవి, గుడివాక రామాంజనేయులు, తోట ఆంజనేయులు, జొన్నాదుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కుచ్చికాయపూడి రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించినట్లు ఆర్అండ్‌బి డి.ఇ కామేశ్వరరావు తెలిపారు. రూరల్, గుడ్లవల్లేరు మండలాల్లో పాడైన మూడు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొడాలి నాని కషితో నాలుగు కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. కుచ్చికాయలపూడి నుండి విన్నకోట రోడ్డుకు పోలిమెట్ల నుండి అంగులూరు చెరువు వరకు రెండు కోట్ల నిధులతో 4.4 కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభమయ్యాయన్నారు. జేమ్స్ పేట-చిన్నగొన్నూరు రోడ్డుకు కట్లవానిచెరువు వరకు 80 లక్షల నిధులతో 2.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని డి.ఈ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, మాజీ ఎంపీపీ కోగంటి ధనుంజయ, సర్పంచ్ లు కొత్తూరి లక్ష్మీనా రా యణ, అడుసుమిల్లి సత్యనారాయణ, కోటప్రోలు నాగు, మండల యూత్ అధ్యక్షుడు గుదే రవి పాల్గొన్నారు.

దయనీయంగా వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

- ఏడు నెలలుగా గుత్తేదారుని పేరుతో అనధికారిక విద్యుత్



ప్రజాశక్తి-పెడన : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాలను దష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో ఆ శాఖకు పెద్దపీట వేస్తుందని నాయకులు ప్రచారాల్లో అదరగొడుతున్న ఆచరణలో మాత్రం అమలకు నోచుకోవడం లేదు. బహిరంగ ప్రకటనలు తప్ప పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని దీనికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇందుకు ఉదాహరణ నేటి నుంచి విద్యుత్ సరఫరా ప్రైమరీ హెల్త్ సెంటర్కు నిలిపి వేయడంతో మునిసిపల్ శాఖ అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. అయితే విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికే మరో అడుగు ముందుకేసి సాక్షాత్తు మున్సిపల్ కమిషనర్ కు నోటీసులు అందజేసిన దుస్థితి సాక్షాత్తు పెడన మున్సిపాలిటీలో కమిషనర్‌కే దక్కిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు ఉన్న విద్యుత్ సౌకర్యాన్ని తొలగించడానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈ భవనాన్ని ప్రారంభించిన ఏడు నెలల్లోనే మూతపడడానికి కారణం అవడానికి అధికారుల సమన్వయ లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఫలితంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దౌర్భాగ్య పరిస్థితి నెలకొం టుందని రోగులు భయంధోళన కు గురవుతున్నారు. ఇది సాక్షాత్తు జిల్లాలోని ఏకైక మంత్రి జోగి రమేష్ నియోజకవర్గంలోని పెడన, అదికూడా పార్టీ ఆఫీసుకు కూత వేటు దూరంలో ఉన్న వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ దయనీయంగా తయారయింది.

వివరాల్లోకి వెళితే పట్టణ పరిధిలోని ఒకటవ వార్డులో వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జూన్ 2023లో మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. ఇది ప్రారంభించి ఏడు నెలలకు కావస్తున్నా నేటికీ ఈ ఆరోగ్య కేంద్రానికి విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే అంతంత మాత్రంగా కేంద్రంలో ఉన్న విద్యుత్ సౌకర్యాన్ని సోమవారం తొలగించడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులు ఇప్పటికే మున్సిపల్ శాఖ అధికారులకు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో ఈ విధమైన చర్యలు తీసుకున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ఏడు నెలలుగా గుత్తేదారుని పేరుతో విద్యుత్ : శంకుస్థాపన సమయంలో ఈ నిర్మాణానికి గుత్తేదారుడు తన పేరుతో కేటగిరి 2 కి మీటర్ను అమర్చు కునేందుకు విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే ఈ భవానికి విద్యుత్ శాఖ నుంచి అనుమతులు లేకపోవడం అలాగే గుత్తేదారుడు పేరు మీద ఉన్న ఈ విద్యుత్ అటు కార్యా లయాల కి, గుత్తేదారుని మరికొన్ని భవన నిర్మాణాలకు ఈ విద్యుత్ను వాడుతున్నారు.

ఇప్పటికే నోటీసులు ఇచ్చాం..

మరో రెండు రోజుల్లో సరఫరా నిలిపివేస్తాం... ఎఇ జయరాం

వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పై ప్రస్తుతం నిర్వహిస్తున్న విద్యుత్ కనెక్షన్ గుత్తిదారుని పేరుతో ఉంది. ప్రభుత్వ నిధుల నుంచి ఈ సెంటర్ కు ట్రాన్స్ఫార్మర్, సర్వీస్ కనెక్షన్ బిగించడానికి బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ అనుమతులు నిలిపివేశాం. ఆరోగ్య శాఖకు సంబంధించింది కనుక గుత్తేదారుని పేరుతో కేటగిరి 2 మీటర్ నుంచి వారు విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులకు నోటీసులు కూడా జారీ చేశారు. త్వరలోనే సర్వీస్ నిలిపివేస్తాం.

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-పెదపారుపూడి : వాస్తవాలను తెలియజేయటంలో ప్రజాశక్తి పత్రిక కు ప్రత్యేక గుర్తింపు ఉందని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. శనివారం రాత్రి వానపాముల గ్రామంలో ప్రజాశక్తి 2024 క్యాలెండర్ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ప్రజాశక్తి వారధిగా పని చేస్తూ మంచి చెడులు తెలియజేస్తుందని తెలిపారు.

యార్లగడ్డ చండీయాగం



ప్రజాశక్తి-గన్నవరం : తెదేపా అధినేత నారా చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గెలవడంతో పాటు ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ గన్న వరం పట్టణంలో పార్టీ నియోజ కవర్గ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు చండీయాగం, సుందరాకాండ పారాయణం ఆదివారం నిర్వహించారు. ఈ హెూమం10వ తేదీ వరకు కొనసాగనుంది. చండీ హెూమములు, చతుర్వేద స్వస్తి కార్యక్రమములు జరిపారు. 10న ఉదయం తెల్లవారుజామున నాలుగు గంటల నుండి యాగం మహెూత్సవం ప్రారంభమై 6:55 ని ' లకు మహా పూర్ణాహుతి దివ్య కళ్యాణ మహెూత్సవం తో కార్యక్రమం పూర్తి అవుతుందని వెంకట్రావు తెలిపారు.

'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'



ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కంచడం గ్రామంలో జరిగింది. సర్పంచ్ బండారు చంద్ర శేఖర్ అధ్యక్షతన జరి గిన ఈ గ్రామ సభలో మండల పార్టీ సీనియర్ నాయకులు రాజబాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాల డుగు బాబురావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి-ఉయ్యూరు : గ్రామీణ ప్రజలకు న్యాయం కోసం సర్పంచ్ల 16 డిమాండ్లు పరిష్కరించకపోతే రాజకీ యాలు, పార్టీలకతీతం సర్పంచ్లో ఉద్యమాన్ని ఉదతం చేస్తామని ఆంధ్రప్రదేశ్ పం చాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద హెచ్చరించారు. ఇటీవల మంగళగిరిలో పంచాయతీరాజ్ చాంబర్, సర్పం చ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచ్లో సదస్సు విజయవంతం కావడం ప ట్ల సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో ఉయ్యూరులో ఆయన నివాసంలో సంఘం కమిటీ నాయకులు ఘనంగా సత్కరించి కతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ల సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు గోలి వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గళ్లా తిమోతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాగి త గోపాలరావు, మండలి ఉదయభాస్కర్, ఆర్గ నైజింగ్ సెక్రటరీ ముప్పనేని రవిప్రసా ద్, ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ పంచర్ల సురేశ్, పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ వంపుగడ ల ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలకు నీరందించాలి :టిడిపి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల దిగువ ప్రాంతమైన రామకష్ణాపురం శివారు భూములకు సాగునీరు అందించాలని జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ డిమాండ్ చేశారు. ఆదివారం రామకష్ణాపురం గ్రామ సమీపంలో నీరు లేక ఎండుతున్న పంట పొలాలను స్థానిక పార్టీ నేతలతో కలిపి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదని, గత ప్రభుత్వంలో మాదిరిగా ఇంజన్లతో నీరు తోడుకోవాల్సిన అవసరం లేదని పదేపదే చెప్తున్న స్థానిక శాసనసభ్యులకు ప్రస్తుత సాగునీటి ఎద్దడికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకులు ఆవులు బసవయ్య దేవన బోయిన వెంకటేశ్వరరావు, అద్దంకి పాండురంగారావు పాల్గొన్నారు.

'తక్షశిల' మరో ఘన విజయం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ 2022 సంవత్సరంలో కోమల్ జైన్ తక్షశిల ఐఎఎస్ అకాడమీ 2017 బ్యాచ్‌కి సంబంధించిన విద్యార్థిని యుపిఎస్సిలో రెండు మార్కులతో ర్యాంకును కోల్పోయి రిజర్వ్ లిస్టులో, ఇండియన్ రైల్వే మేనేజ్మెంట్ సర్వీసెస్‌లో అలాట్‌మెంట్ సాధించింది. కోమల్ జైన్ 2017 తక్షశిల ఐఎఎస్ అకాడమీ డిగ్రీ విత్ ఐఎఎస్ విద్యార్థిని అప్పటినుండి తన సివిల్ సర్వీసెస్ విద్యను నిరాటంకంగా కొనసాగిస్తూ తక్షశిల ఐఎఎస్ అకాడమీ మెంటర్స్, మేనేజ్మెంట్, మరి ముఖ్యంగా విశ్రాంత ఐఎఎస్ అధికారులు వి.ఎన్.విష్ణు, డాక్టర్ నరేష్ సూచనలు, సలహాలతో పాటు ముఖ్యంగా తక్షశిల ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సహకారంతో ఈ విజయాన్ని సాధించినట్లు ప్రస్తుత తక్షశిల ఐఎఎస్ అకాడమీ విద్యార్థులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దుర్గాప్రసాద్ కోమల్ జైన్‌ను అభినందించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకులు సాధించాలని అనుకునే వారికోసం ప్రోత్సాహాన్ని సరైన శిక్షణను అందిస్తామన్నారు. తమ విద్యార్థులు రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇతర వివరాలకు అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బిఎస్ఎన్ దుర్గాప్రసాద్‌ను 9391645450 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఆర్టీసీ డిపో గ్రౌండ్లో జగ్గయ్యపేట నియోజకవర్గస్థాయి నూకల రవి మెమోరియల్ క్రికెట్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను ఆదివారం టిడిపి నేతలతో కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గం టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చిన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రదర్శించాలని గెలుపోటములతో సంపాదన లేకుండా క్రికెట్‌ను ఆడాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో సిద్ధార్థ విద్యార్థుల విజయం

ప్రజాశక్తి - తిరువూరు : చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా విజయవాడలో జనవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో తిరువూరు సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు మూడో స్థానం సాధించినట్లు కరెస్పాండెంట్ యు.చక్రపాణి తెలిపారు. ఇంతటి విజయం సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అయన అభినందించారు.


19న స్మృతివనం ప్రారంభం : మేయర్

ప్రజాశక్తి - భవానీపురం : అంబేద్కర్ స్మృతి వనం ఆవిష్కరణ ఈనెల 19వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. ఆదివారం భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ పిడబ్లుడి గ్రాండ్‌లో నిర్మాణం జరుగుతున్న అంబేద్కర్ స్మృతి వనం విజయవాడ నగర వాసులందరికీ గర్వ కారణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి ఆయన రాసిన రాజ్యాంగం భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆశయాలను పుణికి పుచ్చుకున్న జగనన్న సామాజిక న్యాయం కోసం కషి చేస్తున్నారని చెప్పారు. వైసిపి నాయకులు దేవినేని అవినాష్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఇదే స్థలాన్ని సింగపూర్ టౌన్ షిప్‌కి ఇస్తే, మా ముఖ్యమంత్రి జగనన్న అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేశారని చెప్పారు. పదేళ్లుగా విజయవాడ ఎంపిగా ఉన్న కేశినేని శ్రీనివాస్ (నాని)ని పార్టీ నుండి వెళ్ళి పోవాలని చంద్రబాబు చెప్పటం చూస్తే, టీడీపీలో క్యాష్ కొట్టు సీట్ కొట్టు విధానం నడుస్తుందన్నారు. వైసీపీ పశ్చిమ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతి వనం పేరుతో 125 అడుగుల విగ్రహాన్ని సంతోషంగా ఆవిష్కరణ జరుపుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ పూనూరి గౌతమ్ రెడ్డి, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ తోలెటి శ్రీకాంత్, ఎపిఐడిసి ఛైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు పాల్గొన్నారు.

పుస్తకంతో జీవన వికాసం

పుస్తక మహోత్సవ ముగింపు సభలో వక్తలు


ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పుస్తకాలు జీవన వికాసానికి తోడ్పడతాయి అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పుస్తక మహోత్సవం ముగింపు సభ ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెర్ప్ సిఇఒ ఇంతియాజ్ మాట్లాడుతూ వ్యక్తి వికాసానికి,ఉన్నతికి పుస్తకాలు దోహదపడతాయని అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవానికి ఎంతో చరిత్ర ఉందని అన్నారు. పుస్తక మహోత్సవం కోసం ఎంతో మంది ఎదురు చూస్తారని అన్నారు. ఈ పుస్తక మహోత్సవంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉన్నదని అన్నారు. గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ మాట్లాడుతూ పుస్తక ప్రచురణకు ప్రసిద్ధి చెందిన విజయవాడలో పుస్తక మహోత్సవం ఇంత ఘనంగా విజయవంతం కావడం సహజమే అయినా, ఈ రోజుల్లో ఇంతమంది పుస్తకాలు చదివేవాళ్లుండటం ఆనందదాయకమన్నారు. తెలుగు సాహిత్యం ఎప్పటికపుడు ప్రపంచ సాహిత్యంలోని వివిధ ధోరణులను, శైలిలను ప్రతిబింబిస్తూ ఉండటం ఆనందదాయకమన్నారు. పుస్తకాలను జీవితంలో భాగం చేసుకుని శుభప్రదం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎమెస్కో విజయకుమార్ స్వాగతం పలికి సభను నిర్వహించారు. పుస్తక ప్రదర్శనను సందర్శించిన విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం ముదావహమన్నారు. పుస్తకమహోత్సవాన్ని స్వరాజ్యమైదానం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలోకి మార్చడంలో సహకరించిన అధికారులందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు మాట్లాడుతూ గతంతో పోల్చినపుడు వసతి సౌకర్యాలు తక్కువగా ఉన్నా పుస్తక మహోత్సవాన్ని ఆదరించిన ప్రజలకు, పుస్తక ప్రియులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభావేదికపై నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులందించారు. కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి పుస్తక మహోత్సవ సంఘం గౌరవాధ్యక్షులు బెల్లపుబాబ్జీ, గోళ్ల నారాయణరావు సభలో పాల్గొన్నారు. కార్యదర్శి కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న ఇంతియాజ్

గృహ నిర్మాణ రంగంలో శ్రీ భ్రమర టౌన్‌షిప్ అద్భుతాలు

విజయవాడ : అద్భుతమైన వెంచర్లతో గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సష్టిస్తున్న శ్రీభ్రమర టౌన్షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు, బాపట్ల బీచ్ ఎదురుగా 'అలోహ బీచ్ రిసార్ట్' పేరుతో ఒక విలాసవంతమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి ఆదివారం గ్రాండ్ ప్రీ-లాంచ్ కార్యక్రమాన్ని గుంటూరులోని వెల్కమ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ ప్రీ-లాంచ్ కార్యక్రమాన్ని శ్రీ భ్రమర హౌసింగ్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ గళ్ళా రామచంద్ర రావు ప్రారంభించగా, సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్ రాజు, ఎం.పి.కె లక్ష్మీపతి రాజు, శైలారెడ్డి కోట, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ పాల్గొన్నారు. శ్రీ చెన్నంశెట్టి సతీష్ బాబు, శ్రీ కల్వకోట సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ప్రస్తుత సమాజానికి, విలాసవంతమైన జీవన శైలిని అందించడానికి రియాల్టీ, నిర్మాణ రంగాల్లో అత్యాధునిక పోకడలతో శరవేగంగా దూసుకుపోతున్న శ్రీ భ్రమర చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్టు 'అలోహ బీచ్ రిసార్ట్' వెడ్డింగ్ డెస్టినేషన్, కార్పొరేట్ మీట్స్, ఫ్యామిలీ హాలిడేస్ ట్రిప్‌కు అనువుగా ఉంటుంది. థీమ్ పార్క్, వాటర్ స్పోర్ట్స్, ఫుడ్ కోర్ట్, బీచ్ ఫ్రంట్ హోటల్, హార్స్ రైడింగ్, బీచ్ వాలీబాల్, కిడ్స్ ప్లే జోన్ వంటి ఎన్నో సదుపాయాలు కలిగిన ఈ బీచ్ రిసార్ట్‌లో బీచ్ ఫ్రంట్ ప్లాట్స్, కాటేజెస్, విల్లాస్ వినియోగదారులకు అందుబాటు ధరల్లో లభిస్తాయి.



సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - విజయవాడ : మునిసిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించకపోతే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని పలువురు నాయకులు హెచ్చరించారు. ఆదివారం నాటికి మునిసిపల్ కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరింది. కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ కార్యక్రమానికి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాబస్ అధ్యక్షత వహించారు. ఈ సమ్మెకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని లక్షలాది మంది అంగన్‌వాడీలు, మునిసిపల్ కార్మికులు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు, శ్రామిక మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మీ, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాద్ తదితరులు కార్మికులకు సంపూర్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాజకీయపక్షాలు జోక్యం చేసుకొని ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి వస్తోందని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి తిరుపతమ్మ, గార్లపాటి లక్ష్మీ, టి మార్తమ్మ, సాంబులు, దాసు తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** రియల్ హీరోలు పారిశుధ్య మున్సిపల్ కార్మికులే అంటూ కొండపల్లి చిన్నారులు మా ఆరోగ్యం మీ చేతుల్లోనే అంటూ మున్సిపల్ కార్మికులకు చిన్నారుల మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికులకు టిఫెన్ స్పాన్సర్ చేసి చిన్నారులతో కలిసి మున్సిపల్ కార్మికుల వద్దకు పబ్బతి షాపింగ్ మాల్ అధినేత వీరాంజనేయులు మద్దతు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపిన చిన్నారులకు అభివందనాలు తెలిపారు. మద్దతు తెలిపిన స్టార్ అకాడమీ డైరెక్టర్ షేక్ రెహ్మమత్ అలీని కూడా అభినందించారు. బొర్రా కిరణ్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నియంతలా అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులపై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపి, సమ్మెను నిషేధిస్తూ సమ్మెపై ఎస్మా అస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించటం దుర్మార్గమైన చర్య అన్నారు. **జగ్గయ్యపేట:** మున్సిపల్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్ కొరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు), (ఏఐటియుడి) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కూడలిలోని పాత మున్సిపాలిటీ వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. **వన్‌టౌన్ :** సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లి ఎఐటియుసి విజయవాడ శాఖ ఆధ్వర్యంలో పాత గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ధర్నా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. నగర ఏఐటియుసి కార్యదర్శి ములి సాంబశివరావు, అధ్యక్షులు కె. ఆర్.ఆంజనేయులు , మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నగర నాయకులు జక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు, పాల్గొన్నారు. **తిరువూరు :** మున్సిపల్ కార్మికులు ఆందోళన ఆదివారం కూడా తిరువూరులో కొనసాగింది. నగర పంచాయతీ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన దీక్షా సేవలో పారిశుధ్య కార్మికులు మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. డివైఎఫ్ జిల్లా నాయకులు జక్కులూరి రవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నందిగామ కమిటీ కార్యదర్శి.దాచవరపు సైదా, అధ్యక్షుడు సలికేటి నరేష్, కార్మికులు పాల్గొన్నారు.



విజయవాడలో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు



ఇబ్రహీంపట్నం



జగ్గయ్యపేట



వన్‌టౌన్



నందిగామ



తిరువూరు